క్లుప్తంగా

సీహెచ్‌సీ వైద్యాధికారిణిగా భాగ్యలక్ష్మి



కార్వేటినగరం: సామాజిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణిగా భాగ్యలక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆమె కార్వేటినగరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. పదోన్నతిపై ఆమె సీహెచ్‌సీకి వైద్యాధికారిణిగా బాధ్యతలు స్వీకరించారు.

ప్రదోష పూజలు

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్‌ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తి శ్రద్ధలతో ప్రదోష పూజలు జరిగాయి. ఈ సందర్భంగా శివుడు, నందీశ్వరునికి ఏక కాలంలో అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం నందీశ్వరుడికి పాలతో అభిషేకం చేశారు. ప్రదోష పూజలు అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అదే విధంగా శని త్రయోదశిని పురస్కరించుకుని శనీశ్వరునికి పాలాభిషేకం చేశారు.

ఉగ్రదాడి హేయం



ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు, విద్యార్థులు

పాలసముద్రం: కశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం సాయంత్రం పాలసముద్రం దళితవాడ యువకులు కొవ్వొత్తుల ర్యాలీ ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్‌ఖాజీ కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో సర్‌ఖాజీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యతోనే కుల, మత వర్గ భేదాలు తొలగి పోతాయని, నైతిక విలువలు పెరిగి ఉత్తమ పౌరులుగా రాణించవచ్చన్నారు. అనంతరం ప్రభుత్వం సర్‌ఖాజీగా నియమితులైన షేక్ జాఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

శ్రీరంగరాజపురం: మండలంలోని శ్రీరంగరాజపురం, పుల్లూరు క్రాస్ రోడ్డు, గంగమ్మగుడి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాలను ఎమ్మెల్యే డాక్టర్ వీ.ఎం థామస్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ భాస్కర్‌రెడ్డి సహకారంతో ఏబీ హెల్పింగ్ హ్యాండ్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ట్రస్ట్ ప్రజలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

బందోబస్తు విషయంలో నిర్లక్ష్యం వద్దు

కాణిపాకం: ఉగ్రవాదుల దాడుల నేపథ్యంలో ఆలయంలో పటిష్ట బందోబస్తు కల్పించాలని ఈవో పెంచల కిషోర్ ఆదేశించారు. కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన పరిధిలో ఆయన శనివారం హోంగార్డులు, సెక్యూరిటీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులను చెకింగ్ పాయింట్ల వద్ద క్షుణంగా పరిశీలించాలన్నారు. రాత్రి పూట అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎవరైనా అనుమానంగా కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఈవో రవీంద్రబాబు, సిబ్బంది కోదండపాణి తదితరులున్నారు.

స్వచ్ఛ పల్లెలు

- ఆదర్శంగా ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, వనదుర్గాపురం పంచాయతీలు
- పటిష్టంగా తడి, పొడి చెత్త సేకరణ



శ్రీకావేరిరాజుపురం పంచాయతీలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

పాలసముద్రం: మండల పరిధిలోని గ్రామాల్లో స్వర్ణాంధ్ర..స్వచ్ఛాంధ్ర పటిష్టంగా అమలు చేసేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. ఇంటింటికీ చెత్త సేకరణలో ప్రజల భాగస్వామ్యం పెరగడంతో స్వచ్ఛ పల్లెల దిశగా అడుగులు పడుతున్నాయి. ఉదయాన్నే వీధుల్లోకి విజిల్ వేస్తూ గ్రీన్ అంబాసిడర్లు చెత్త రిక్షాతో ఇంటి ముంగిటకే వస్తుండడంతో తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందిస్తున్నారు. చెత్తను ఎరువుగా తయారు చేసి పంచాయతీకి ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారు. ఈ విధానంలో శ్రీకావేరిరాజుపురం పంచాయతీ ఆదర్శంగా నిలుస్తోంది.

మండలంలో ఇలా..

పాలసముద్రం మండలంలో 13 పంచాయతీలున్నాయి. 44 మంది గ్రీన్ అంబాసిడర్లుకు 22 రిక్షాలు ప్రభుత్వం అందించింది. ఈ గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై అధికారులు దృష్టి పెట్టారు. విధిగా పంచాయతీల్లో చెత్త సేకరణను చేపడుతున్నారు. అధికారులు చెత్త సేకరణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రతి ఇంటికీ గ్రీన్ అంబాసిడర్లు వెళ్లి చెత్త సేకరించి డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. సేకరించి చెత్తను అయిదు రకాలుగా విభజిస్తున్నారు. ప్లాస్టిక్ గాజు సీసాలు, చిత్తు కాగితాలు, పాత ఇనుప సామగ్రి, పాత సంచులుగా తడి, పొడి చెత్తను వేరు చేస్తున్నారు. ఇలా చెత్తను వర్మీకంపోస్టుగా మార్చి ఎరువుగా విక్రయిస్తున్నారు. దీంతో వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ ఖాతాకు జమ చేస్తున్నారు.

మూడు పంచాయతీలు ఆదర్శం

మండలంలో 12 డంపింగ్ యార్డులు ఉండగా వాటి ద్వారా ఏడాదికి 7 వేల కిలోల ఎరువు తయారవుతోంది. వీటిని విక్రయించగా పంచాయతీలకు ఆదాయం సమకూరుతోంది. ప్రధానంగా శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం, వనదుర్గాపురం పంచాయతీలు చెత్త సేకరణతో పాటు ఎరువుల విక్రయం, ఆదాయంలో ముందు వరుసలో ఉన్నాయి. ఈ మూడు పంచాయతీలకు ఏడాదికి డంపింగ్ యార్డు నుంచి రూ 45 వేల వరకు ఆదాయం వస్తోంది. శ్రీకావేరిరాజుపురం పంచాయతీలో 600 కేజీల వరకు చెత్త సేకరణ జరగగా ఆదాయం రూ 15 వేలకు పైగా వస్తోంది. వనదుర్గాపురం 500 కేజీల వరకు చెత్త సేకరించగా రూ 10 వేలు, పాలసముద్రం 450 కేజీలకు రూ.6 వేలు ఆదాయం వస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

సేకరణకు ప్రత్యేక శ్రద్ధ

పంచాయతీ సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి శ్రీకావేరిరాజుపురం పంచాయతీల్లోని గ్రామాలను స్వచ్ఛ దిశగా తీసుకెళ్లేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రీన్ అంబాసిడర్లు గ్రామాల్లో ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరణ చేస్తున్నారు. ప్రతి ఇంటికి రెండు చెత్త బుట్టలు అందించాం. పల్లెలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకున్నాం. –గాలి మహేష్ బాబు, శ్రీకావేరిరాజుపురం, సర్పంచ్

చెత్త సంపద కేంద్రం అభివృద్ధి

ప్రభుత్వ ఆదేశాల మేరకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం. వీటి ద్వారా ప్రజల్లో చాలా మార్పులు గమనించాం. గ్రామాల్లో పరిశుభ్రత నెలకొంది. తద్వారా పంచాయతీకి ఆదాయాన్ని సమకూరుస్తున్నాం. ఇలా చేసిన వర్మీకంపోస్టు ఎరువుకు గిరాకీ పెరుగుతోంది.
– ఎస్.విద్యావతి, ఎంపీడీఓ, పాలసముద్రం



వర్మీకంపోస్టు ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ సుధాకర్ రావు (ఫైల్)



ఎస్‌కేఆర్ పురంలో గ్రామాల్లో చెత్త సేకరిస్తున్న గ్రీన్ అంబాసిడర్లు

మార్కెట్ కమిటీ ఏర్పాటుకు మళ్లీ ప్రతిపాదనలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): నగరి, ఎస్‌ఆర్‌పురం (శ్రీరంగరాజుపురం) మార్కెట్ కమిటీకి ఏర్పాటుకు సంబంధించి శనివారం మళ్లీ ప్రతిపాదనలు వెళ్లాయి. ఇటీవల ఈ రెండు మార్కెట్ కమిటీలకు సంబంధించి ప్రతిపాదనలు పంపారు. ఈ ప్రతిపాదనలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ పాటించలేదని రాష్ట్ర శాఖ ప్రతిపాదనలను వెనక్కు పంపింది. దీంతో అధికారులు మళ్లీ ప్రతిపాదనలను సరిదిద్ది పంపించారు. వారం రోజుల్లో ఈ రెండు కమిటీలను ప్రకటించే అవకాశాలున్నాయని మార్కెటింగ్ శాఖ అధికారులు చెబుతున్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభోత్సవంలో డీఎస్పీ

నగరి: పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ శనివారం ప్రారంభించారు. ప్రజలకు తాగినీటి సమస్యను తగ్గించడంలో భాగంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఇలాంటి కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన దాత రవిని అభినందించారు. ప్రజలు ఎక్కువగా సంచరించే ప్రాంతంలో చలివేంద్రాలు ప్రారంభించాలని కోరారు. ఇలాంటి మంచి కార్యక్రమాలకు తాము ఎప్పుడూ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగరి నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

శిలాఫలకం ధ్వంసం



సామిరెడ్డిపల్లిలో ధ్వంసమైన శిలాఫలకం

పెనుమూరు(కార్వేటినగరం): తారు రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. శనివారం స్థానికుల కథనం మేరకు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ. 4 కోట్లతో సామిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల సమీపంలో చేపట్టిన తారు రోడ్డు నిర్మాణానికి ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని టీడీపీ నాయకులు కొందరు రెండు రోజుల కిందట రాత్రి పూట ధ్వంసం చేశారన్నారు. దీనిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తామని వైఎస్సార్‌సీపీ నేతలు తెలిపారు.

పశువులకు వ్యాధి నివారణ చర్యలు

నింద్ర: మండలంలోని పాడి రైతులు తమ పశువులకు వ్యాధి నివారణ చర్యలు తీసుకోవాలని అరూరు పశువైద్యశాల వైద్యాధికారి ప్రభాకర్ వర్మ అన్నారు. అరూరు గ్రామంలో శనివారం టీకాలు వేశారు. ఆయన మాట్లాడుతూ గాలి కుంటువ్యాధి నివారణకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. టీకాలు వేసుకుని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పాడి ఆవులకు పాల దిగుబడి తగ్గడం, జర్వం, చొంగకారడం, కుంటడం వంటి లక్షణాలు కనిపిస్తే తక్షణం వైద్య సేవలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. రాగి తీగలు చోరీ



గుద్యాణంపల్లి వద్ద దొంగలు ధ్వంసం చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

పెనుమూరు (కార్వేటినగరం): ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం చేసి రాగి తీగలు అపహరించుకుపోయిన ఘటన మండలంలోని గుద్యాణంపల్లి సమీపంలోని పొలంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. విద్యుత్ ఏఈ వివరాల మేరకు.. రైతులు రాజారెడ్డి, రఘునాథరెడ్డి, పి.రాజారెడ్డి కోసం పొలానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగలు అపహరించుకు పోయారన్నారు. దీనిపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలం పాదరిరేడు సర్కిల్ వద్ద అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తుండగా శనివారం ఎస్ఐ ధర్మారెడ్డి తన సిబ్బందితో దాడి చేసి పట్టుకున్నారు. పాదిరేడు సర్కిల్ వద్ద అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తున్న అర్జునయ్య (55)ను పట్టుకొని ఆయన వద్ద నుంచి 20 బాటిల్స్‌ను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదకరంగా మ్యాన్ హోల్స్



తెరిచి ఉన్న మ్యాన్ హోల్



మ్యాన్‌హోల్‌లో దిగిన కారును తోస్తున్న స్థానికులు

నగరి: మున్సిపల్ పరిధిలో నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన మ్యాన్ హోల్స్ ప్రమాదకరంగా మారుతోంది. రోడ్డుపై మ్యాన్ హోల్ ప్లేట్లను తొలగించే సిబ్బంది వాటిని మూయడం లేదు. చావడి ప్రాంతంలో ఇలా మూతపెట్టక వదిలిపెట్టిన మ్యాన్ హోల్‌లో రాత్రిపూట పలువురు పడిపోతున్నారు. శనివారం ఉదయం వీధి మలుపు తిప్పే సమయంలో ఒక కారు టైరు మ్యాన్ హోల్‌లో దిగిపోవడంతో కారు పక్కకు ఒరిగింది. స్థానికులు పరుగున వచ్చి కారును పైకి లాగారు. మున్సిపల్ అధికారులు మ్యాన్ హోల్‌కు మూత పెట్టి ప్రమాదాలు నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

ఎట్టకేలకు బోర్డుల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



గేటు ఎంత వసూలు చేయాలని అధికారులు ఏర్పాటు చేసిన బోర్డు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో మార్కెట్ గేటు రుసుముల వసూళ్లపై జరుగుతున్న బలవంతపు వసూళ్లకు సంబంధించి ‘సాక్షి’ పత్రికలో ప్రచురితమైన కథనాలు వాస్తవమేనని అధికారులు ఎట్టకేలకు అంగీకరించారు. రైతులు, చిన్నపాటి వ్యాపారుల నుంచి మార్కెట్ గేటు వసూలు చేయాల్సిందానికన్నా, ఎక్కువ మొత్తంలో దోచుకుంటున్న వైనంపై ఈనెల 22న ‘సాక్షి’ పత్రికలో ‘గేటు జలగలు’ శీర్షికన కథనం ప్రచురితమైంది. తాటి ముంజెలు, కొబ్బరి బోండాలు అమ్ముకుంటున్న వాళ్ల నుంచి రోజుకు రూ.50 వసూలు చేయడం, చిన్న వ్యాపారుల నుంచి రూ.30, లారీలకు రూ.500 నుంచి రూ.2 వేలు వరకు వసూలు చేయడంపై ఇందులో ప్రచురితమయ్యాయి. ఇంత జరుగుతున్నా అధికారులు గేటు వసూలు రుసుములు బహిర్గతంగా తెలియచేయకపోవడాన్ని ప్రశ్నించడంతో.. ఎట్టకేలకు కార్పొరేషన్ అధికారులు బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ బోర్డులో ఏ వ్యాపారం చేసేవాళ్లు ఎంత చెల్లించాలనే వివరాలను స్పష్టంగా తెలియచేశారు. కూరగాయలు 30 కిలోల వరకు విక్రయిస్తే మార్కెట్ బయట రూ.7, 50 కిలోల వరకు రూ.10, 50 కిలోలకు పైబడితే రూ.10 చొప్పున గేటు చెల్లించాలని బోర్డులో సూచించారు. కానీ వాస్తవానికి బోర్డులో సూచించిన దానికంటే రెండింతలు అదనంగా వసూలు చేస్తున్నారు. బోర్డులో పానీపూరీ బండ్ల ప్రస్తావనే లేదు. అయినా రిక్షాపై వచ్చి వ్యాపారం చేస్తే రూ.10 చెల్లించాలని ఉంది. కానీ ఒక్కో పానీపూరి దుకాణం నుంచి రూ.30–50 వసూలు చేస్తున్నారు. పండ్లు బుట్టలో పెట్టుకుని అమ్మితే రూ.5 వసూలు చేయాల్సి ఉంటే.. రూ.30–50 వసూలు చేస్తున్నారు. ఆక కూరలు ఒక పెద్ద కట్టకు రూ.10 చెల్లించాల్సి ఉండగా.. రూ.30 వసూలు చేస్తున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన బోర్డులో అన్ని వివరాలు నమోదు చేశారు. అధిక మొత్తంలో గేటు వసూలు చేస్తే ప్రశ్నించాల్సిన బాధ్యత వ్యాపారులు, రైతులపైనే ఉంది. కాదని దౌర్జన్యం చేస్తే పోలీసులకు, మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేయొచ్చు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



అప్పలాయగుంటలో గ్రామోత్సవంలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి

వడమాలపేట (విజయపురం): అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల సేవ వైభవంగా సాగింది. ఉదయం వేకువ జామున సుప్రభాతసేవతో స్వామి వారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు నిర్వహించారు. సాయంత్రం ప్రసన్న వెంకటేశ్వర స్వామిని ఉభయ నాంచారులను సర్వాభరణాలు, పూలమాలలతో అలంకరించి ఊయలలో కొలువుదీర్చారు. వేదమంత్రాలు, భక్తుల గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ ఆండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు కొబ్బరికాయలు, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చేరుకున్న స్వామివారికి మంగళ హారతులిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

శ్రీపసన్న వినాయక ఆలయంలో మండల పూజ



ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

నింద్ర: మండల కేంద్రంలోని ప్రసన్న వినాయక ఆలయంలో శనివారం మండల పూజ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నెల రోజుల క్రితం కుంభాభిషేకం నిర్వహించారు. నేడు మండల పూజ కార్యక్రమంలో ఉదయం ఆలయంలో అభిషేకాలు, హోమం, అర్చనలు చేశారు. గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులు పాడి పంటను కాపాడుకోవాలి



రైతును సన్మానిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రైతులు పాడి పంటను కాపాడుకోవాలంటూ, ఆర్థికవృద్ధికి బాటలు వేసుకోవాలని ఏపీఎల్‌డీఏ శ్రీనివాసరావు అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో శనివారం వరల్డ్ వెటర్నరీ డేను ఘనంగా నిర్వహించారు. తొలుత శాఖ అధికారులు, సిబ్బంది పలు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పశువులు మానవ జీవితంలో భాగమేనన్నారు. పశువుల వల్ల ఆరోగ్యం, ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. అలాంటి సంపదను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పారు. అనంతరం పశు సంతతి పరిశీలన పథక శాఖ ఆధ్వర్యంలో సిబ్బంది మునిరాజమ్మ, గోవిందస్వామి నాయుడు, శ్రీనివాసులు నాయుడు, రైతులు ఆరుముగం, హరి, వెంకటరెడ్డిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి అరిఫ్, పశు సంతతి పరిశీలన పథక డీడీ వాసు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనాలకు ప్రతిపాదనలు

చిత్తూరు రూరల్(కాణిపాకం): వేరుశనగ విత్తనాలకు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు శ్రీకాళహస్తీలోని విత్తనకాయల సరఫరా కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కే6 రకం విత్తనాలు 36,566 క్వింటాళ్లు, నారాయణి 1,521 క్వింటాళ్లు, టీసీజీఎస్ 1694 రకం 2,252 క్వింటాళ్లు కావాలని నివేదికలు పంపారు. ఈ మేరకు మే నెలలో కేంద్రం నుంచి జిల్లాకు వేరుశనగ విత్తనాలు సరఫరా కానున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా మే 15వ తేదీ నుంచి రైతులకు విత్తన కాయలు పంపిణీ చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

వినూత్న ప్రచారం



టెడ్డీబేర్ దుస్తులతో హోంగార్డులు

ద్విచక్ర వాహనాలు ఉపయోగించే ప్రతి ఒక్కరూ హెల్మెట్ తప్పనిసరిగా ఉపయోగించాలని చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు కోరారు. హెల్మెట్ వాడకంపై ప్రజల్ని చైతన్యం చేయడంలో భాగంగా శనివారం ట్రాఫిక్ హోంగార్డులు టెడ్డీబేర్ దుస్తులు ధరించి నగరంలోని పలు ప్రధాన కూడళ్ల ల్లో హెల్మెట్ ధరించిన వాహనదారులను ఆపి, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు.
–చిత్తూరు అర్బన్

ద్విచక్ర వాహనాలు ఢీ





ఘటనా స్థలంలో మునివేల్ మృతదేహం, తిరుత్తణి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారులు

- ఆంధ్రాకు చెందిన వ్యక్తి మృతి
- నలుగురికి గాయాలు

తిరుత్తణి: తిరుత్తణి సమీపంలో జాతీయ రహదారిపై రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఆంధ్రాలోని నగరికి చెందిన వ్యక్తి మృతి చెందగా అతని ఇద్దరు కుమారులు, మరోబైకులో వచ్చిన వ్యక్తితో పాటూ అతనితో పాటు వెళ్లిన చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు కథనం మేరకు ఆంధ్రాలోని నగరికి చెందిన మునివేల్(45) అతని కొడుకులు భరణి(10), రూపేష్(8) ముగ్గురు శనివారం సాయంత్రం తిరుత్తణికి వచ్చి ద్విచక్ర వాహనానికి డ్యూ చెల్లించి ఇంటికి వెళ్తుండగా నాగలాపురానికి చెందిన ప్రశాంత్(35) అతని మిత్రుడి కుమారుడు అమర్‌నాథ్(10)తో కనకమ్మసత్రానికి వెళ్లారు. చెన్నై తిరుపతి జాతీయ రహదారిలో పొన్పాడి వద్ద రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి.. ప్రమాదంలో మునివేల్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. అతని ఇద్దరు కుమారులతో పాటూ మరో బైకులో వెళ్లిన ప్రశాంత్, అమర్‌నాథ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.